సాక్షి
నారాయణపేట

శనివారం, 10, జూన్, 2023



కోనేరుకు పూర్వవైభవం

జడ్చర్ల వేంకటేశ్వరస్వామి కోనేరుకు పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి.

వివరాలు 8లో ▸



నిరంతర పోరాటం

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని బల్మూర్ వెంకట్ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.7 /23.6

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దశాబ్దాల కల సాకారం..



దామరగిద్ద: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న దామరగిద్ద తండావాసుల దశాబ్దాల కల సాకారమైంది. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వారు ఇళ్ల పట్టాలు అందుకున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తండా వాసులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సర్వే నెంబర్ 117లో 2 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. కాగా పట్టాలను ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు భూ సర్వే పెండింగ్, తదితర సమస్యలతో ఇన్నాళ్లుగా సర్వే చేపట్టపోవడంతో ఎదురుచూపులు తప్పలేదు. తాజాగా కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవతో మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ఇళ్ల పట్టాలను సిద్ధం చేశారు. కాగా మొత్తం రెండెకరాల భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల, తదితర పబ్లిక్ అవసరాల కోసం ఎకరా భూమిని కేటాయించారు. మరో ఎకరా భూమిలో ఒక్కొక్కరికి 110 గజాల చొప్పున 34 మందికి ప్లాట్లను రూపొందించి శుక్రవారం పట్టాలను అందజేశారు. దీంతో గిరిజనుల కల నెరవేరింది. సర్పంచ్ కిష్టమ్మ సమక్షంలో ఆనందోత్సాహాల నడుమ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలకు గిరిజనులు పాలాభిషేకం చేశారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన పెంచాలి



నారాయణపేట రూరల్: ఆర్టీసీ అందిస్తున్న సేవలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేసి మరింత లాభపడాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వీరస్వామి అన్నారు. స్థానిక బస్టాండ్‌లో శుక్రవారం విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీటీఓ హాజరై మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి వారికి రవాణా సాధనం కేవలం ఆర్టీసీ బస్సు మాత్రమేనని, అందరికి అందుబాటులో ఉండి భద్రతతో గమ్య స్థానాలకు చేరుస్తుందని కొనియాడారు. విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమం ద్వారా కేటాయించిన పల్లెల్లో పర్యటించి రాయితీ పాసులు, అద్దె ప్రాతిపదికన తక్కువ రేటుకు బస్సులు అందించడం తదితర విషయాలపై తెలియజేయాలన్నారు. అలాగే, వారి నుంచి ఫిర్యాదులు, ఆర్టీసీ అభివృద్ధికి అందించే సలహాలు, సూచనలను సేకరించి డిపోలో తెలియచేయాలన్నారు. అనంతరం వారికి బ్యాగు, ప్రత్యేక షర్టులు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎం ఆంజనేయులు, ఎస్‌టీఐ నజీరోద్దీన్, సిబ్బందిపాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతమే ధ్యేయం

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలని డీఈఓ రవిందర్ ఆదేశించారు. స్థానిక ఆదర్శ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్లస్టర్ హెచ్‌ఎంల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరు విధిగా గ్రామాల్లో పర్యటించి కొత్త విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. సమయానికి పుస్తకాలు, యూనిఫామ్స్ విద్యార్థులకు అందించాలని, తొలిమెట్టు కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి టీచర్లు ఎక్కువగా ఉన్న వాటిని గుర్తించి అవసరమైన టీచర్లను నిబంధనల మేరకు సర్దుబాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఎంఓ విద్యాసాగర్, నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు దుక్కి దున్ని విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారని, వారు నకిలీ విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసి మోసపోకుండా గ్రామ పోలీసులు, ఏఈఓలు అవగాహన కల్పించాలన్నారు. విధిగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి రైతులను చైతన్యం చేయాలని, నాణ్యతకు, నకిలీ విత్తనాలు మధ్య వ్యత్యాసం తెలియచేయాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ విక్రయించే లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దని, నకిలీ విక్రయదారులపై నిఘా పెట్టాలన్నారు. రైతులను మోసం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

జిల్లా కేంద్రంలోని బీమండి కాలనీలోని స్కూల్‌కి ఇద్దరు టీచర్లను కేటాయిస్తే సీనియర్‌గా ఉన్న టీచర్ ఫర్విన్ బాను హెచ్‌ఎం బాధ్యతలు తీసుకోకుండా జూనియర్‌గా ఉన్న జ్యోతికి అప్పగించి అక్రమంగా మరికల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లింది. జ్యోతి అనారోగ్యంతో సెలవు పెట్టడంతో తిరిగి స్కూల్‌కు రావాలని డీఈఓ స్వయంగా ఫోన్ చేసి చెప్పినా వినలేదు. చేసేది లేక శివాజీనగర్ స్కూల్ నుంచి లక్ష్మారెడ్డిని కేటాయించారు.

నర్వ మండలం కల్వాల జెడ్పీ స్కూల్లో సింగిల్ ప్యాటర్న్‌లో గణిత ఉపాధ్యాయురాలు కృష్ణవేణి అక్కడ సొంతంగా వలంటీర్‌ను ఏర్పాటు చేసి ట్రిబుల్ ప్యాటర్న్ ఉన్న ధన్వాడ జెడ్పీ బాలుర పాఠశాలకి డిప్యూటేషన్‌పై వచ్చింది. ఒక్క టీచర్ ఉన్న స్కూల్ నుంచి ముగ్గురు పనిచేస్తున్న స్కూల్‌కి టీచర్‌ను ఎందుకు కేటాయించారో విద్యాశాఖ అధికారులకే తెలియాలి. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది.

నారాయణపేట మండలంలోని నెమళ్లపల్లి పాఠశాల విద్యార్థుల్లేక కొద్ది సంవత్సరాలుగా మూతబడింది. అయితే అక్కడ పనిచేస్తున్న టీచర్ శ్రీనివాస్‌ను అదే క్లస్టర్‌లో అత్యధిక విద్యార్థులు ఉండి టీచర్ల కొరతతో ఇబ్బందులు పడుతున్న బొమ్మన్‌పాడు పాఠశాలకు కేటాయించకుండా కొల్లంపల్లి క్లస్టర్‌లోని లక్ష్మీపూర్ సింగిల్ టీచర్ పాఠశాలకు కేటాయించారు. అదేవిధంగా అక్కడికి మక్తల్ నుంచి మరో టీచర్‌ను 317లో పొరపాటు జరిగిందనే పేరుతో కలెక్టర్‌ను సాకు చూయిస్తూ అక్కడికే పంపించారు.

ఇష్టారాజ్యం..!

- నిబంధనలకు పాతరేసి నచ్చిన చోటికి తాత్కాలిక బదిలీలు
- పోస్టింగ్ ఒక చోట.. విధులు మరో చోట
- విద్యార్థులకు అందని నాణ్యమైన విద్య
- ఈ విద్యా సంవత్సరం అయినా వీటికి తెరపడేనా?



నారాయణపేట రూరల్: విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తీసుకువస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడంలేదు. కొందరు టీచర్లు నిబంధనలకు పాతరేసి డిప్యూటేషన్లు చేపడుతుండటంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుంది. గ్రామీణ ప్రాంతాలు, దూర ప్రదేశాల్లో పనిచేయడం ఇష్టంలేక పైరవీలు చేస్తూ నచ్చినచోటికి తాత్కాలికంగా బదిలీపై వెళ్తున్నారు. దీంతో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందక విద్యాశాఖ అబాసుపాలువుతుంది. మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించే విద్యాశాఖలో ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకుల రెకమండేషన్లు.. కార్యాలయ సిబ్బంది చేతివాటం.. వెరిసి కోరుకున్న చోట తాత్కాలికంగా పోస్టింగ్ పొందుతున్నారు. ఇక సర్దుబాటు సాకు చూపిస్తూ తమకు కావాల్సిన టీచర్లకు నచ్చిన చోటకు తరలిస్తున్నారు.

500 పాఠశాలలు.. 2020మంది టీచర్లు

జిల్లా వ్యాప్తంగా 13మండలాల్లో 339ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 76 ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిని 33 క్లస్టర్లుకు కేటాయించారు. అయితే 2,490 పోస్టులు మంజూరు కాగా గత ఏడాదిలో 2020మంది టీచర్లు వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్నారు. దాదాపు 470 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కోవిడ్ తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరిగింది. సరైన స్థాయిలో ఉపాధ్యాయుల నియామకం లేక తిరిగి ప్రైవేటు వైపు వెళ్తున్నట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. దీనికి తోడు జిల్లా మొత్తానికి ఒక్కరే రెగ్యులర్ ఎంఈఓ



డీఈఓ కార్యాలయం..

ఉండటం ఆయనకు మరో నాలుగు మండలాలు అదనంగా కేటాయించడం, మరో ఇద్దరు జీహెచ్‌ఎంలకు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించి 8మండలాలను పంచేశారు. ఇక క్లస్టర్ హెచ్‌ఎంలు సైతం చాలాచోట్ల స్కూల్ అసిస్టెంట్లు ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ కుంటుబడింది. దీంతో టీచర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా తయారైంది.

ఇష్టారీతిగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్..

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి ఇబ్బందులు పడుతున్న పాఠశాలలకు ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం 2022–23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం విద్యాశాఖకు అవకాశం ఇచ్చింది. ముందుగా విద్యార్థులు, టీచర్ల నిష్పత్తిని పరిశీలించి అదనంగా ఉన్న టీచర్ల జాబితా సిద్ధం చేయాలి. వారిని అదే క్లస్టర్‌లో ఎక్కువ విద్యార్థులు ఉండి టీచర్ల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలకు కేటాయించాలి. అలా కాకుండా పైరవీలు, సిఫారసులు, దొడ్డిదారి వ్యవహారాలకు ప్రాధాన్యం ఇచ్చి నిబంధనలు తుంగలో తొక్కి ఇతర మండలాలకు ఇష్టారీతిగా పంపించారు. మొత్తానికి జిల్లాలో గత ఏడాది 80మందికి ఒక చోట నుంచి మరో చోటకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్లో పంపిస్తే వారిలో 69మంది ఎస్‌జీటీలు, 5మంది స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు పండిట్‌లు, ఒక పీఈటీ ఉన్నారు.

సిఫారసులు.. ఒత్తిళ్లు

ఒక వక్క వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియలో టీచర్లను ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు పంపిస్తే మరో వక్క అక్రమంగా డిప్యూటేషన్లు ఇచ్చి టీచర్లను మండలాలు దాటించేశారు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, టీచర్స్ యూనియన్ నాయకుల ఒత్తిడి, కార్యాలయ ఉద్యోగుల చేతివాటంతో కావాల్సిన చోట పోస్టింగ్ ఇచ్చేశారు. కనీసం ఈ విద్యా సంవత్సరంలోనైన అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు టీచర్లు కోరుతున్నారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు



ఉపాధ్యాయుల కొరత అధిగమించడానికి అత్యవసరమైన కొన్ని పాఠశాలలకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం వాస్తవమే. ఇష్టారీతిగా డిప్యూటేషన్లు ఇవ్వడం పొరపాటు. దీనిపై విచారణ చేస్తాం. ఈ ఏడాదికి సంబంధించి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియపై క్లస్టర్ హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించి వాస్తవమైన వారిని గుర్తించేందుకు ఆదేశాలు ఇచ్చాం. ఐదుగురు జీహెచ్‌ఎంలతో కమిటీ వేసి పారదర్శకతతో డిప్యూటేషన్లు ఇస్తాం. – రవీందర్, డీఈఓ

ఇక బుక్క చీటీలు ఉండవ్..



మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి

సాక్షి ఎఫెక్ట్..

నారాయణపేట: మార్కెట్ యార్డులో ఎలాంటి బుక్క చీటీలు ఇవ్వడం లేదని.. ఒకవేళ ఇస్తే సదరు కమీషన్ ఏజెంట్లపై మార్కెట్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. బుక్క చీటీలతో రైతుల నుంచి నూటికి రూ.6 నుంచి రూ.7వరకు కమీషన్ తీసుకోవడంపై 'బుక్క చీటీలే.. తక్ పట్టీలు' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమవగా.. మార్కెట్ పాలకవర్గం, అధికారులు స్పందించారు. యార్డులోని దుకాణం 19లో ఓ రైతుకు బుక్క చీటీ ఇచ్చి అందులో కమీషన్‌తోపాటు దడవాయి, హమాలీ తదితర వాటిని రాసినట్లు విచారణలో తెలిందని తెలిపారు. సదరు దుకాణ యాజమానికి నోటీసు ఇచ్చామని మూడు రోజుల్లో సంజాయిషీ ఇస్తారని, దాని ప్రకారం మార్కెట్ నిబంధనలను అతిక్రమించినట్లయితే అతనిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి రైతులు కమీషన్ ఏజెంట్ల వద్ద తక్ పట్టీలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమకు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. మార్కెట్ చైర్‌పర్సన్‌తో పాటు మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, మార్కెట్ కార్యదర్శి భారతి ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.5,699

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,699, కనిష్టంగా రూ.4,266 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,856, కనిష్టంగా రూ.1,460, ఆముదాలు గరిష్టంగా రూ.5,499, కనిష్టంగా రూ.5,480 ధరలు పలికాయి.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



బీసీ కులవృత్తిదారుడికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: సంక్షేమం, అభివృద్ధి సీఎం కేసీఆర్‌కు రెండు కళ్ల వంటివని, మూడోసారి సైతం రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక జీపీ శెట్టి ఫంక్షన్ హాలులో జరిగినసంక్షేమ సంబరాల్లో ఆయనతోపాటు కలెక్టర్ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా తీసుకెళ్తున్నారని, రైతుబంధు కింద ఇప్పటి వరకు రూ.65వేల కోట్లు ఇచ్చారన్నారు. త్వరలో నియోజకవర్గానికి 4వేల ఇండ్లు గృహ లక్ష్మి పథకం కింద మంజూరు చేయనున్నట్లు వివరించారు. రెండవ విడతలో 4,775 మందికి రూ.83.56 కోట్ల విలువ చేసే గొర్రెలను పంపిణీ చేస్తామన్నారు. ప్రజలందరూ మరోసారి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి రుణం తీర్చుకుంటే మరిన్ని సంక్షేమ ఫలాలను అందుకుంటామన్నారు.

నిజమైన లబ్ధిదారులకు రూ.లక్ష సాయం : కలెక్టర్

నిజమైన లబ్ధిదారులకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందుతుందని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. 21 రోజుల పాటు తెలంగాణ ప్రభుత్వం గత తొమ్మిది ఏళ్లలో నిర్వహించిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించడానికి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సంబరాల్లో 650 కల్యాణలక్ష్మి, 34మందికి ఇంటి స్థలాలు, 12 యూనిట్ల గొర్రెలు, బీసీ కులవృత్తి దారులకు రుణాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ ఎం.జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ అంజలి, భీమయ్యగౌడ్, అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, డీడబ్ల్యూఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు తీపికబురు

- పింఛన్ మరో రూ.వెయ్యి పెంపు
- వచ్చే నెల నుంచి రూ.4,116 అందజేత
- జిల్లాలో 10,527 మందికి లబ్ధి

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తీపికబురు అందించింది. వచ్చే నెల నుంచి పింఛన్ మరో రూ.వెయ్యి పెంచి రూ.4116ను అందజేయనుందని సీఎం కేసీఆర్ మంచిర్యాల సభలో వెల్లడించారు. తాజాగా దివ్యాంగులు రూ.3,016 పింఛన్ అందుకుంటున్నారు. దీంతో జిల్లాలోని దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో 10,527 మందికి లబ్ధి

జిల్లాలో దివ్యాంగులు 10,527 మంది లబ్ధిదారులు ప్రతి నెల రూ.3,016 చొప్పున రూ.3,17,49,432 లబ్ధిపొందుతున్నారు. సీఎం ప్రకటనతో ఒక్కో లబ్ధిదారుడికి వచ్చే నెల నుంచి రూ.4,116 అందనున్నాయి. ఈమేరకు రూ.4,33,29,132 నిధులు విడుదల కానున్నాయి. ఇదిలాఉండగా, శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన సంక్షేమ సంబరాల్లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం సంపద సృష్టించి ప్రజలకు పంచుతారని అన్నారు. ఆ వ్యాఖ్యలు చేసిన ఏడు గంటల వ్యవధిలోనే సీఎం పింఛన్ పెంపు ప్రకటన చేయడంతో జిల్లాలో ఎమ్మెల్యే వ్యాఖ్యలు చర్చానీయాంశమయ్యాయి.

కుటుంబ పోషణకు తోడ్పాటు



సీఎం కేసీఆర్ దివ్యాంగులకు అడగకముందే వరమిచ్చాడు. గతంలో రూ. 3,016 వచ్చే పింఛన్ ఇప్పుడు రూ.4,116 కు పెంచడం ఆనందంగా ఉంది. ఈ పెంపు కుటుంబ పోషణకు మరింత తోడ్పాటు అందించినట్లవుతుంది.

– కనకప్ప, దివ్యాంగుడు, మరికల్

ఆత్మగౌరవాన్ని పెంచింది



దివ్యాంగుల పింఛన్ రూ.వెయ్యి పెంచడంతో పాటు సీఎం కేసీఆర్ వారి ఆత్మగౌరవాన్ని పెంచారు. ఒకరి వద్ద చేయి చాచకుండా ఆత్మగౌరవంగా బతికేలా చేశారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మరింత ఆసరా అందించడంతో మనో ధైర్యాన్ని నింపింది.

– నర్సప్ప, ఎంపీపీ, దామరగిద్ద

సంతోషంగా ఉంది



రూ.3వేలు అందుతున్న పింఛన్ తాజాగా రూ.వెయ్యి పెంచడంతో ఆనందంగా ఉంది. వచ్చేనెల నుంచి రూ.4,116 ఇస్తామని సీఎం ప్రకటించడంతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపినట్లయింది.

– పుంజనూర్ బాబు, దివ్యాంగ సంఘం మండల అధ్యక్షుడు, మాగనూర్

భద్రత లేని ఉద్యోగాలు



పీయూ ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

- పీయూలో పనిచేస్తున్న సిబ్బందిలో అభద్రతాభావం
- ఏళ్ల తరబడి పనిచేస్తున్నా క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం
- రెగ్యులర్ ఉద్యోగులను నియమిస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన
- ఐదు రోజులుగా కొనసాగుతున్న నిరసనలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీని నిరంతరం సమస్యలు వేధిస్తున్నాయి. వసతుల కల్పన, సదుపాయాలు, అభివృద్ధి అంశాలు ఒక ఎత్తు అయితే.. అక్కడ పనిచేసే సిబ్బంది సమస్యలు మరో ఎత్తుగా మారాయి. యూనివర్సిటీతో పాటు గద్వాల, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ పీజీ సెంటర్లలో ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగాలు కేటాయించకపోవడంతో టీచింగ్‌లో 96మందిని కాంట్రాక్టు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల కోసం అధ్యాపకులను తీసుకున్నారు. మిగతా 153 మంది నాన్‌టీచింగ్ సిబ్బంది తాత్కాలిక, అడ్‌హాక్ పద్ధతిలో గతంలో భర్తీ చేశారు. ఈ క్రమంలో వీరు విధుల్లో చేరి ఏళ్ల గడుస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఇటీవల ప్రభుత్వం డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి రెగ్యులరైజ్ చేయడంతో యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులు తమను కూడా రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా యూనివర్సిటీల ఉమ్మడి నియామక బోర్డు ద్వారా కొత్త అధ్యాపకులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేస్తే ఇప్పుడు పనిచేస్తున్న తమను తొలగిస్తారన్న ఆందోళన వీరిలో పెరగడంతో అభద్రతాభావానికి లోనవుతున్నారు. ఇందుకోసం వారంరోజులుగా యూనివర్సిటీలో పలు రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై అటు అధికారులు గాని.. ఇటు ప్రభుత్వం గాని స్పందించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది.

అర్హత ఉన్నా..

యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా కాంట్రాక్టు, సెల్ఫ్ ఫైనాన్స్ అధ్యాపకులు పని

పీజీ సెంటర్	టీచింగ్ సిబ్బంది	నాన్‌టీచింగ్ సిబ్బంది
కొల్లాపూర్	17	6
గద్వాల	4	5
వనపర్తి	14	7
పీయూ	61	135

చేస్తున్నారు. వీరికి పీజీతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ వంటి అన్ని అర్హతలు ఉన్నాయి. అధ్యాపకులుగా పనిచేయడంతో పాటు అదనపు బాధ్యతలు సైతం నిర్వహిస్తున్నారు. హాస్టల్ వార్డెన్లుగా, హెచ్‌ఓడీలు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. వీరి సంఖ్య 96 మంది ఉండగా.. రెగ్యులర్ అధ్యాపకుల సంఖ్య కేవలం 32 మంది మాత్రమే ఉంది. ఈ క్రమంలో తమ వద్ద చదివి జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చేరిన చాలా మంది విద్యార్థులకు ఉద్యోగాలు రెగ్యులర్ అయ్యాయి. వీరికి మాత్రం రెగ్యులర్ కాకపోవడం పట్ల వీరి నుంచి అసంతృప్తి వ్యక్తమవుతుంది. యూనివర్సిటీలో ఉద్యోగాలే జీవనోపాధిగా విధులు నిర్వహిస్తున్న చాలా మందికి వయస్సు పైబడటం, మరికొంత మంది రెండు, మూడేళ్లలో రిటైర్‌మెంట్‌కు సిద్ధంగా ఉన్న వారున్నారు.

కోర్టుమెట్లు ఎక్కిన నాన్‌టీచింగ్ సిబ్బంది

యూనివర్సిటీలో మిగతా ఉద్యోగులతో పోల్చితే నాన్‌టీచింగ్ ఉద్యోగల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. యూనివర్సిటీ ప్రారంభమైన మొదట్లో తాత్కాలిక పద్ధతిలో వీరిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు వివిధ స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్నారు. తక్కువగా రూ.7,500ల నుంచి రూ.24 వేల వరకు వేతనాలు ఉన్నాయి. ఇందులో తమకు కావాల్సిన వారికి అధికంగా వేతనాలు ఇస్తున్నారని, మిగతా వారికి తక్కువ ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే వీసీగా రాజారత్నం హయాంలో ప్రతి సంవత్సరం 12 శాతం వేతనాలు పెంచేలా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఆమోదించారు. నాలుగేళ్లపాటు బాగానే వేతనాలు పెంచినా.. ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో రెండేళ్లుగా ఇటు వేతనాలు పెరగక.. అటు ఉద్యోగ భద్రత లేక చాలామంది సిబ్బంది అభద్రతాభావానికి లోనవుతున్నారు. ఈ క్రమంలోనే యూనివర్సిటీ ప్రారంభంలో చేరిన వారు హైకోర్టును ఆశ్రయించగా.. యూనివర్సిటీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

ఫైనాన్స్ సెక్రటరీకి పంపించాం



యూనివర్సిటీ ప్రారంభం నుంచి కొంతమంది టీచింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి సమస్య ఉన్నది వాస్తవమే. కానీ, నిర్ణయం నేరుగా తీసుకొని రెగ్యులరైజ్ చేయాల్సింది ప్రభుత్వం. ఇతర డిపార్ట్‌మెంట్లలో కొంత మందిని రెగ్యులర్ చేసినట్లే వీరిని కూడా చేసేందుకు అవకాశాలు లేకపోలేదు. నాన్‌టీచింగ్ సిబ్బంది 12శాతం వేతనం పెంపు ఈసీలో ఆమోదించి ఫైనాన్స్ సెక్రటరీకి పంపించాం. ఆమోదం వచ్చిన వెంటనే వేతనాలు పెరుగుతాయి.

– లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ వీసీ

రెగ్యులరైజ్ చేయాలి..



పీయూ ప్రారంభం నుంచి అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాం. మాతో చదువుకుని కాంట్రాక్టు ఉద్యోగుల్లో డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో చేరినవారు నేడు రెగ్యులర్ ఉద్యోగాలు పొందారు. కానీ, వయస్సు పైబడుతున్న తమను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అందుకే ఐదురోజులుగా నిరసన కార్యక్రమం కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలి.

– భూమయ్య, పుటా అధ్యక్షుడు

సీఎం స్పందించాలి..



యూనివర్సిటీ ప్రారంభం నుంచి పీయూ అభివృద్ధికి నాన్‌టీచింగ్ సిబ్బంది ఎంతో కృషి చేశారు. ఇప్పుడు చాలా మంది వయోభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. మా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరుతున్నాం.

– రాంమోహన్, నాన్‌టీచింగ్ సంఘం అధ్యక్షుడు, పీయూ

హామీ నిలబెట్టుకోవాలి..



గత కొన్నేళ్లుగా యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. మిగతా డిపార్ట్‌మెంట్‌లో ఉన్నవారిని ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. కానీ, యూనివర్సిటీలో పనిచేస్తున్న మమ్మల్ని విస్మరించింది. సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని, సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికైనా నిలబెట్టుకోవాలి.

– స్వాతి, కాంట్రాక్టు అధ్యాపకురాలు, పీయూ

క్లుప్తంగా

ఆటో ఢీకొని మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

గట్టు: మండలంలోని మాచర్లలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మహిళను శుక్రవారం ఆటో ఢీకొంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్లకు చెందిన మైలే రాఘవేంద్ర అతని తల్లి లక్ష్మి (55) అయిజలోని శుభకార్యానికి హాజరయ్యేందుకు మాచర్ల నుంచి బల్గెర వైపు వెళ్తున్నారు. బల్గెర నుంచి మాచర్ల వైపు ఆటోను డ్రైవర్ కుర్వ బాలాజీ వేగంగా నడుపుకుంటూ వచ్చి లక్ష్మిని ఢీ కొట్టాడు. ఆమె తల, కుడి కాలికి గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను అంబులెన్స్‌లో గద్వాలకు తరలించారు. మార్గమధ్యలోనే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడు రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్..

కొత్తకోట: మండలంలోని ఈదుంబావితండా శివారులో కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ జెత్యనాయక్ (61) మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండలం గుండ్యేవాల్యి నాయక్ తండాకు చెందిన జెత్యనాయక్ కొంతకాలంగా ఈదుంబావితండా శివారులో ఓ క్వారీలో కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఒకచోట నుంచి ఇంకోచోటుకు ట్రాక్టరు నడుపుతున్న సమయంలో ఎడమవైపు రాయి ఎక్కించటడంతో ట్రాక్టర్ గుంతలోకి దూసుకుపోయి బోల్తాపడింది. అక్కడే ఉన్న రాళ్లు తగలడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. కుమారుడు చందర్‌నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

నారాయణపేట రూరల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కిష్టయ్య హైదరాబాద్ రోడ్డులో హంబ్బన్నరైస్ మిల్ వద్ద కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నాడు. పిల్లర్ దశలో ఉన్న స్థలంలో గురువారం వర్షానికి నీరు నిల్వ ఉంది. వాటిని తోడేందుకు తన కుమారుడు బాలపృథ్వీ (24)ని శుక్రవారం ఉదయం వెంట తీసుకుని వెళ్లి మోటార్ సాయంతో నీటిని తోడుతున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

చెరువులో పడి మరొకరు..

పాలమూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని న్యూమోతీనగర్‌కు చెందిన అలకుంట విజయ్(30) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈయన గురువారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం సాయంత్రం దొడ్డ లోనిపల్లి శివారులో ఉన్న కొత్తగుంట చెరువులో మృతదేహం లభించింది. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి కానుగకుంటలో పడి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి వెలుగు చూసింది. పోలేపల్లికి చెందిన పరశురాం (22) గురువారం మరో వ్యక్తితో కలిసి చేపలు పట్టేందుకు గొల్లపల్లి కానుగకుంటకు వెళ్లాడని, ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రాత్రి మృతదేహం కుంటలో తేలింది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గుర్తుతెలియని వ్యక్తి..

వనపర్తి: మండలంలోని రాజపేట శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టింది. 108 అంబులెన్స్ సిబ్బంది అతన్ని జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి..

ఆత్మకూర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ మహమ్మద్ జావేద్ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం అల్వాల్‌పాడ్ చెందిన నాగేంద్రం(38) గురువారం రాత్రి బైక్‌పై వస్తుండగా పిన్నంచర్ల సమీపంలో నారాయణపేటకు చెందిన తూఫాన్ వాహనం ఢీకొట్టింది. స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని మృతుడికి భార్య చందన, ఇద్దరు పిల్లలున్నారని వివరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు డ్రైవర్ శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోనేరుకు పూర్వ వైభవం


వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన శిథిలావస్థలో ఉన్న కోనేరు

- వేంకటేశ్వరస్వామి ఆలయంలో 10 శతాబ్దాల కిందట నిర్మాణం
- త్వరలో సందర్శించనున్న పురావస్తుశాఖ అధికారులు
- రూ. కోటితో మరమ్మతులకు ప్రతిపాదన


కోనేరులో నిర్మించిన మంటపాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ నడిబొడ్డున ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ కోనేరుకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 10 శతాబ్దాల కిందట నిర్మించిన కోనేరు మూడు దశాబ్దాల నుంచి శిథిలావస్థకు చేరుకుంటూ వస్తుంది. దీన్ని త్వరలో పురావస్తుశాఖ అధికారులు సందర్శించనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో లోకాయపల్లి సంస్థానాధీశులు వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు కోనేరు, శివాలయం నిర్మించారు. వీటి నిర్వహణకు గాను దూపదీప నైవేద్యాలు, నిత్యపూజల కోసం వందలాది ఎకరాలు కేటాయించారు.

ఒకవైపు మెట్లదారి, రెండు వైపులా మంటపాలు

ఆలయానికి ఎడమవైపు శివాలయం నిర్మించారు. శివాలయానికి ఆనుకుని సుందరమైన కోనేరును ఏర్పాటు చేశారు. కోనేరుకు ఒకవైపు మాత్రం మెట్లు, రెండు వైపులా మంటపాలు, మూడువైపులా గుమ్మటాలు, ప్రాకారాలు నిర్మించారు. తూర్పువైపు రాతితో గోడ కట్టారు. కొందరు భక్తులు మెట్లద్వారా కోనేటిలో స్నానమాచరించి మంటపాల్లో దుస్తులు మార్చుకునేవారు. 1820లో కోనేటికి చిన్న మరమ్మతులు చేసి పక్కనే ఆంజనేయస్వామి ఆలయం నిర్మించినట్లుగా పూర్వీకులు చెబుతున్నారు. 1980–90దశకం వరకు కోనేటిలో పుష్కలంగా నీళ్లు ఉండేవి. 1985–90 మధ్యలో పట్టణంలో వినాయక ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన విగ్రహాలను కోనేరులోనే నిమజ్జనం చేసేవారు. దీంతో కోనేరులో మట్టిచేరి పూడిక తీసేవారు లేక క్రమక్రమంగా నీటిమట్టం తగ్గిపోయింది. 1990 తరువాత కోనేటిలో నీరు లేక వట్టిపోయింది. అప్పటికే చుట్టూ ఉన్న మంటపాలు ఒక్కొక్కటిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తూర్పువైపు ఉన్న గోడ పూర్తిగా పడిపోయింది. దీంతో కోనేరును పూడ్చి వేయాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. కొందరు స్థానికులు వ్యతిరేకించటంతో ఆ ప్రయత్నం కాస్త విఫలమైంది. ప్రస్తుతం కోనేటిని డంపింగ్‌యార్డులా మార్చేశారు. ప్రస్తుత మున్సిపాలిటీ పాలకమండలి రూ.కోటి వ్యయంతో కోనేరుకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో ఆలయాన్ని పురావస్తుశాఖ అధికారులు సందర్శించి ప్రతిపాదనలను ఆమోదించనున్నారు.

పూర్వీకులు స్నానమాచరించేవారు



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరులో స్నానమాచరించేవారని, నీళ్లు ఎల్లపుడు భూమికి సమాంతరంగా ఉండేవని పూర్వీకులు చెప్పగా విన్నాం. అయితే మేం చూసినప్పటి నుంచి శిథిలమై ఉంది. దానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పాలకమండలి నిర్ణయించింది. చరిత్రకలిగిన కోనేరు మా వార్డులో ఉండటం, దానికి పూర్వవైభవం తీసుకువచ్చే అవకాశం దక్కటం అదృష్టంగా భావిస్తున్నా.
– శశికిరణ్, కౌన్సిలర్, 26వ వార్డు

పూర్వ వైభవం తీసుకువస్తాం



వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న కోనేరు, కావేరమ్మపేట గచ్చుబావి రెండింటికీ పూర్వవైభవం తీసుకువస్తాం. చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే ఇలాంటి కట్టడాలు మనప్రాంతంలో ఉండటం వరమనే చెప్పాలి. గత పాలకుల వైఫల్యం కారణంగా భావితరాలకు అందించాల్సిన చారిత్రాత్మక కట్టడాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కోనేరు, గచ్చుబావి రెండింటి అభివృద్ధి కోసం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాం.
– లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

దిక్సూచీగా కల్వకుర్తి ఆస్పత్రి


వీసీలో పాల్గొన్న వైద్యులు

కల్వకుర్తి టౌన్: సాధారణ కాన్పుల విషయంలో రాష్ట్రంలోనే కల్వకుర్తి సీహెచ్‌సీ దిక్సూచీగా నిలిచిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని సీహెచ్‌సీల వైద్యులతో నిర్వహించిన వీసీలో భాగంగా ఈ విషయాన్ని చెప్పినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం తెలిపారు. కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. మే నెలలో 155 సాధారణ కాన్పులు నిర్వహించారని, 38 మాత్రమే సిజేరియన్లు చేసినట్లు వైద్యుడు విజయ్‌కుమార్‌కు కితాబిచ్చారు. రాష్ట్రంలోని అన్ని సీహెచ్‌సీలు ఇలాంటి ప్రతిభనే కనబరచాలని ఆయన సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించటడంతో పాటు, డైట్ మెనూ పాటించాలని, రెఫరల్ రేటును తగ్గించటంతో పాటుగా లామా కేసులు తగ్గే విధంగా చూడాలని వైద్యులకు ఆదేశాలు ఇచ్చారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 14వ తేదీన వైద్య ఆరోగ్య దినాన్ని సక్రమంగా నిర్వహించేలా అధికారులు సమాయత్తం కావాలని సూచించారు. సమావేశంలో డాక్టర్లు స్వర్ణలత, పాండురంగ, యశోదాబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి, హెడ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పొలాల్లోకి కాలుష్య నీరు


ఫార్మ కంపెనీ నుంచి రాయపల్లి రైతుల పొలాల్లోకి వస్తున్న కాలుష్య నీరు

రాజాపూర్: చిన్నపాటి ముసురు వర్షం కురిస్తే.. ఇదే అదునుగా భావించి రైతుల పంట పొలాల్లోకి ఫార్మాకంపెనీల నుంచి కాలుష్య నీటిని వదులుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన చిన్నపాటి ముసురు వర్షానికి రాయపల్లికి చెందిన రైతుల పొలాల్లోకి సమీపంలో ఉన్న పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా, ఇతర పరిశ్రమల నుంచి కాలుష్యపు నీటిని వదలటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్లుగా యథేచ్ఛగా రైతుల పొలాల్లోకి వర్షం నీరనే సాకుతో కాలుష్య జలాలు వదులుతున్నారు. ఇదివరకే కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసిన పరిశ్రమల తీరు మారడం లేదు.

విద్యార్థుల కోసం నిరంతర పోరాటం

- రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి
- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్


ఆన్‌లైన్ క్విజ్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వెంకట్

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎన్‌ఎస్‌యూఐ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి వరుసగా ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లతోపాటు 40 కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఒక మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీ అందజేస్తామని చెప్పారు. జిల్లాలోని విద్యార్థులు, యువత ఈనెల 17వరకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పార్టీ అధికారంలోకి రాగానే యూత్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేవరకు ప్రతి నెల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లా మంత్రి ఒకసారి పాలమూరు యూనివర్సిటీకి వెళ్లి అక్కడి ఉద్యోగుల సమస్యలు తెలుసుకోవాలని, రెగ్యులరైజ్ గురించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌ఎస్‌యూఐ మండల కమిటీలు

మండల స్థాయిలో ఈనెల 20 వరకు ఎన్‌ఎస్‌యూఐ కమిటీలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ప్రతి మండలానికి ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణవర్ధన్‌రెడ్డి, రమేష్, శేఖర్, పృథ్వీ, ఉమర్, పురుషోత్తం, నాగరాజు, ఫహాద్, అజయ్, నవాజ్, సమీర్, ఫైజాన్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

నారాయణపేట: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎన్‌ఎస్‌యూఐ బలోపేతం చేసేందుకు త్వరలో పూర్తి స్థాయిలో కొత్త కమిటీలను నియమిస్తామన్నారు. రాష్ట్రంలో త్వరలో పార్టీ అధికారంలోకి రాబోతుందని, రాష్ట్రం బీఆర్ఎస్ నిరంకుశ పాలను సాగనంపేందుకు అందరూ 6 నెలలు కష్టపడి పని చేయాలన్నారు.

బాల్యవివాహం అడ్డుకున్న అధికారులపై దాడి

గద్వాల క్రైం: బాల్యవివాహం చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు అడ్డుకునేందుకు వెళ్లిన క్రమంలో వారిపై కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ ఆనంద్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల మండలం మదనపల్లికి చెందిన బాలికకు వివాహం చేస్తున్నట్లు డయల్ 100, 1098కు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించారు. ఈ మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ శివ, కృష్ణ, రూరల్ పోలీసులు బాల రక్షక్ వాహనంలో అక్కడికి వెళ్లారు. వివాహం చేయకూడదని కుటుంబ సభ్యులకు వివరించారు. ఈ క్రమంలో వివాహ వయస్సు ఉన్నందుకే వివాహం చేస్తున్నామని అధికారులతో వాదించారు. బాలికను అక్కడి నుంచి గుట్టుగా తప్పించారు. గమనించిన పోలీసులు బాలికను గుర్తించేందుకు వాకాబు చేశారు. ఈ క్రమంలో బాలిక అవ్వకు స్వల్ప అస్వస్థతకు గురైంది. చికిత్స నిమిత్తం బాలరక్షక్ వాహనంలో ఎక్కించారు. వారి కుటుంబ సభ్యులను సైతం అదుపులో తీసుకునేందుకు అధికారులు ముందుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు అధికారి కృష్ణ, డ్రైవర్ శేషావలిపై దాడి దాడి చేసి, వాహనం ధ్వంసం చేశారు. గమనించిన పోలీసులు వారిని చెదరగొట్టి పోలీసుస్టేషన్‌కు అతికష్టం మీద తరలించారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



కేటీదొడ్డి: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. నందిన్నెకు చెందిన ఎరుకలి నర్సింహులు, పరశురాం పలు గ్రామాల నుంచి 18 రేషన్ బియ్యాన్ని సేకరించి రాయచూర్‌కు బొలెరా వాహనంలో తరలిస్తుండగా కుచినెర్ల శివారులో పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సకల సదుపాయాలతో సైనిక భవనం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- మాజీ సైనికులకు అండగా ప్రభుత్వం
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): దేశంలో ఎక్కడా లేని విధంగా మూడు అంతస్తుల్లో సకల సదుపాయాలతో జిల్లా కేంద్రంలో సైనిక భవనాన్ని నిర్మించామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బండమీదపల్లిలో పాలమూరు యూనివర్సిటీ సమీపంలో రూ.1.75 కోట్ల వ్యయంతో నిర్మించిన సైనిక సంక్షేమ భవనాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాజీ సైనికులు, సైనిక సంక్షేమ శాఖ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇన్నాళ్ల అద్దె భవనంలో సేవలు కొనసాగాయని ఇప్పుడు దర్జాగా సొంత భవనం ప్రారంభించుకున్నామని చెప్పారు. ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి కార్యాలయం, ఆర్మీ క్యాంటీన్, పాలిక్లినిక్ ఒకే చోట ఉండడం వల్ల మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోకుండా సేవలు పొందేందుకు వీలవుతుందన్నారు. మాజీ సైనికుల సంక్షేమం, సహకారం కోసం సీఎం కేసీఆర్‌ను అడగ్గానే 2016 లో రాష్ట్రంలోని ఉద్యోగస్తులందరి అంగీకారంతో వారి ఒక రోజు జీతం రూ.22 కోట్లను సైనిక సంక్షేమ నిధికి అందించారని మంత్రి గుర్తు చేశారు. మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. మాజీ సైనికుల కోసం ఇంటి స్థలాలను అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామన్నారు. మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ సైనిక్ భవన్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఘనత మంత్రికి దక్కిందని సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కల్నల్ రమేష్‌కుమార్ తెలిపారు. సైనికుల సంక్షేమం కోసం మంత్రి ఎంతో సహకరించారని, సైనిక సంక్షేమ నిధి ఏర్పాటు కోసం మంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతి తీరని లోటు

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలం వెంకంపల్లి సర్పంచ్ మురళీధర్‌రెడ్డి మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం సర్పంచ్ గుండెపోటుతో మృతి చెందగా, శుక్రవారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని పాడె మోశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ మొదటి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. గ్రామంలో రూ.51 కోట్లతో మంజూరైన పేరూర్ లిఫ్టు మంజూరు విషయంలో నిరంతరం శ్రమించారని తెలిపారు. ఆయన కలలు కన్న లిఫ్టు పనులు పూర్తి కాకముందే చనిపోవడం బాధాకరమన్నారు. సర్పంచ్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

చిన్నారులపై పిచ్చికుక్క దాడి

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో శుక్రవారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ఇళ్ల ఎదుట ఆడుకుంటున్న పిల్లలపై దాడి చేసి తీవ్రంగా కరిచింది. ఇద్దరు చిన్నారులు వేర్వేరు చోట్ల కుక్క కాటుకు గురయ్యారు. గ్రామానికి చెందిన ఖాజా మనువడు మహ్మద్ రిజ్వాన్ ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అకస్మాత్తుగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. చెంప, మెడపై తీవ్రంగా కరవడంతో బాలుడికి తీవ్ర రక్తస్రావమైంది. అదే కుక్క మరో చోట ఆడుకుంటున్న అంజనేయులు కుమారుడు జ్ఞానేశ్వర్‌పై దాడి చేసి కరిచింది. ఆ బాలుడికి గాయాలయ్యాయి. గ్రామస్తులు కుక్కను వెంబడించి తరిమేశారు. ఇదిలా ఉండగా కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన రిజ్వాన్‌ను తల్లిదండ్రులు మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నీలోఫర్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. జ్ఞానేశ్వర్ కాలుపై కుక్క కరవడంతో అడ్డాకుల పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. ఈ సంఘటనతో గ్రామంలో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

వర్గీకరణ సాధనకై 'చలో పాలమూరు'


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 12న చలో పాలమూరు కార్యక్రమం చేపట్టినట్లు ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపడతామని నేతలు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాసభకు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మాదిగలు, ఉపకులాల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, బాలు, శీలం అంజి, మహేష్, శ్రీకృష్ణ, శివ, రమాకాంత్ తదితరులున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 9 మందికి జైలుశిక్ష

గద్వాల క్రైం: మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడిన తొమ్మిది మందికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.500జరిమానా విధిస్తూ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్ నాయక్ తీర్పును వెల్లడించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్ భాస్కర్ శుక్రవారం తెలిపారు. నెల క్రితం జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది మద్యం తాగి వాహనాలను నడుపుతున్నారు. తనిఖీల్లో భాగంగా వారిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేయగా, శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి జైలుశిక్ష

ధరూరు: వివాహితను లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ కర్నె శేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఉదయ్ నాయక్ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. 2017లో మండలంలోని పారుచర్లకు శ్రీకాంత్ ఓ వివాహితను లైంగికంగా వేధించాడు. ఆమె రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ మురళీగౌడ్ కేసు నమోదు చేయగా అందుకు సంబంధించిన తీర్పును శుక్రవారం వెల్లడించారు. సాక్షులను ప్రవేశపెట్టడంలో కోర్టు కానిస్టేబుళ్లు స్వామిరాజ్, గజేంద్రలు సహకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న జంగయ్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వసతులతో పాటు ఉపాధ్యాయులను నియమించినప్పుడే నాణ్యమైన విద్య అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టకపోతే నిరసన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, నర్సిములు, ఉమాదేవి, భాస్కర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

టైర్ పేలి ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కారు టైరు పేలడంతో ట్రాక్టర్‌ను ఢీకొన్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు ఇటిక్యాల మండలంలోని కొట్టం కళాశాల సమీపంలోకి రాగానే టైరు ఒక్కసారిగా పేలింది. ఈ క్రమంలో కారు అదుపుతప్పి ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వాళ్లంతా తేలికపాటి గాయాలతో బయటపడ్డారు.

1,018 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,018 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.